క థ

# వెయ్యిన్నొకటో స్తంభం

– పెద్దాడ మూర్తి



అవాళ పున్నమి. వెన్నెల వెల్లువలా నింగినుంచి నేలకి ఉరక లెత్తుతోంది. శరత్కాలపు శీతలపవనాలు వాతావరణాన్ని మంచుకంబళితో కప్పిపెట్టినట్టుగా దట్టంగా వీస్తున్నాయి. చేరువలోని సెలయేరు, గట్టువద్ద తబ్బిబ్బు పడినప్పుడల్లా వినిపించే ధ్వనులు మంచువీణని శృతి చేస్తున్నట్టుగా ఉన్నాయి.

అంతఃపురం ప్రశాంతంగా ఉంది. ప్రాహారికుల కావలాల వద్ద, అంతఃపుర స్త్రీల అంతరంగిక మందిరాల వద్ద మైనపుదీపాలు చీకటితో భేటీపడి విజయం సాధిస్తున్నాయి.

నిశ్శబ్దమూ, ప్రశాంతతా సంధి చేసుకున్న ఆ సమయంలో ఓరుగల్లు రాచనగరులోని అతి ప్రధాన మందిరంలో ఒక యువతి మానసం మాత్రం అందుకు విరుద్ధ భావాలతో ఉలికులికి పడుతోంది.

ఆ మందిరం కాకతీయ సామ్రాజ్ఞిది. ఆమె రుద్రమదేవి.

గణపతిదేవ చక్రవర్తి వారసురాలిగా; కాకతీయ సామ్రాజ్యానికి నవమ చక్రవర్తినిగా సింహాసనం అధిష్టించిన రాణి రుద్రమదేవిది.

రాజ్యం సుభిక్షంగా ఉంది. పాలన ప్రశంసార్హంగా ఉంది. అక్కడక్కడ శత్రువులు తలెత్తుతున్నా వాటిని ముందుగానే ఊహించి తగిన జాగ్రత్తలు తీసుకోగల మంత్రాంగమూ, పోరు తప్పకపోతే కర్కశంగా అణచివేయగల యంత్రాంగమూ నిత్యం సర్వసన్నద్ధంగా ఉన్నాయి. అయినా సామ్రాజ్ఞి

మనసులో కల్లోలం... గుండెల్లో నిప్పుల కుంపటి రగులుతున్నట్లుగా.

తెలుగు ప్రజల హృదయాధినేత్రి; కాకతీయ సామ్రాజ్ఞి సింహాసనాధినేత్రిగా కాదు... ఒక సాధారణ స్త్రీగా!

000

అదేరోజు... కనుచీకట్లు ముసురుకుంటున్న వేళ...

సాయంవ్యాహ్యాళి ముగించి అంతఃపురం దిశగా బయలుదేరింది రుద్రమ. అంతవరకూ ఉరకలు, పరుగులు తీసి నురగలు కక్కుతున్న తురగం, గమ్యం చేరువయ్యే కొద్దీ గమనం మందం చేసింది. రుద్రమ కూడా ఆ అశ్వగమనాన్ని ఆస్వాదించసాగింది.

ఇంతలో ప్రధాన రహదారిని జనపదుల వీధులవైపు వేరు చేసే ఒక చిన్న మార్గంలోనున్న పొదలవద్ద అలజడి.

రుద్రమదేవి రాచరికపు నెత్తురు అప్రమత్తమైంది. హస్తం అసంకల్పితంగా కృపాణం వైపు మళ్లింది. గుర్రాన్ని ఆ దిశగా పోనిచ్చింది. కొద్దిక్షణాల్లోనే రుద్రమకు అవగతమైంది అది ప్రమాదహేతువు కాదని. పల్లీయుల జంట ఏకాంతంలో నిర్మించుకుంటున్న ప్రమోదసేతువని. అప్రయత్నంగానే ఆమె అధరాలపై దరహాసం వెలుగొందింది.

గుర్రం అక్కడే ఆగి ఏపుగా పెరిగిన గ్రాసపు లేత మొలకలని రుచి చూడసాగింది. కుతూహలం కొద్దీ ఆ పొదలోకి చూపులు ఎక్కుపెట్టింది రుద్రమ. వారు జానపదులు. బహుశా పద్మశాలీలు. ఆ రోజుల్లో కాకతీయ సామ్రాజ్యం నేతపనికి దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. అతి చక్కని నూలు చీరెలు, జరీ చీరెలు స్త్రీ హృదయానుగతంగా నేయటంలో అపురూపమైన నైపుణ్యాన్ని ప్రదర్శించేవారు నేత కార్మికులు. అందుకు తగినట్లుగానే ఆ జంటలోని పురుషుడి చేతిలో మంచి అద్దకం పని చేసిన ఒక నూలు చీరె... అది ఆ స్త్రీకి ఇస్తున్నట్టు ఇస్తూనే ఆమె ముద్దుని కొసరి కొసరి అడుగుతున్నాడు.

"పోఁ మావా... ఇట్టాంటియన్నీ మనువైనాకే" కసిరి కొడుతున్నట్టుగా అంటోంది స్త్రీ. కాని, ఆ విసురులోనే కొంత మురిపెం లేకపోలేదు. అది తెలుసాకుర్రవాడికి.

"అయన్నీ సరేలే... అందాక కొసరైనా పెట్ట్ పొగదే" బ్రతిమాలాడుతున్నాడు.

"అక్క చూస్తుంది" అక్కడలేని అక్కను అక్కరకు తెచ్చుకుంది ఆ గడుసరి.

"అక్క బావతో చేసే పని కాదంటే" మరింత రెచ్చగొడుతున్నాడామెని.


"ఊఁ... కాదు" అంటూనే చటుక్కున అతని బుగ్గమీద ముద్దు ముద్దరవేసి చీరెని చేత పుచ్చుకుని చప్పున జారుకుందా సొగసరి.

జక్కువ పక్షుల జంటల్లా కువకువలాడుకున్న ఆ నవయౌవనులని చూసిన రుద్రమ అదే దరహాసంతో అంతఃపురానికి మళ్లింది.

కాని, పదేపదే అదే దృశ్యం కనుల ముందర బొమ్మ కట్టసాగింది.

ఆ గుసగుసలు... ఆ విరవిరలు... ఏమిటిది? ఆ ఇద్దరూ కాయకష్టం చేసుకునేవారిలా ఉన్నారు. కాని, ఎంతటి ఆనందం ఆ ఇద్దరి వదనాల్లో?

ఆ కళ్లల్లో మెరుపు ముందు ప్రపంచంలోని సంపదంతా దిగదుడుపే... ఆ సంతృప్తి ముందు ఎన్ని సామ్రాజ్యాలైనా వృథాయే...




నిజమా, స్త్రీ పురుష సంగమం, అది కూడా కాదు, ఒక స్పర్శ, మించి ఒక చూపు అంతకుమించి ఒక ఎదురుచూపు. సంతృప్తితో కూడిన ఒక నిట్టూర్పు. చెవి తమ్మె మీదుగా వీచే ఒక నిశ్వాస పవనం... వీటన్నింటిలో ఇంత తన్మయత్వం ఉందా?

ఇంతటి తాదాత్మ్యత ఉందా? ఇంతటి అద్వైతం ఉందా?

అంతఃపురంలో ఉన్నా ఆలోచనలు అస్థిమిత పరుస్తున్నాయామెని. వెనుకవైపు ఉద్యానంలోనికి నడిచింది. అక్కడ ఒక జలయంత్రం వద్ద చందన శిలపై మేను వాల్చింది.

చందనం, శీతలం సంస్పర్శించినా కానీ ఆమె తనువొక వేడి ఆవిరికేంద్రం లాగానే ఉంది.

హఠాత్తుగా ఒక ఆలోచన ఆమె మదిలో మెదిలి వెన్నుని ఒణికించింది.

'తను స్త్రీయా... పురుషుడా?'

జననం రుద్రమదేవిగా... మనుగడ రుద్రమదేవ మహారాజుగా.

పురుష సంతానంలేని నాయనగారి కోరిక, ఆజ్ఞల ప్రకారం పురుషవేషంలో సింహాసనాధిపత్యం వహించింది.

అది సరే--

తనకు స్త్రీగా తన ఉనికి తెలిసినదెప్పుడు? ఒక స్త్రీ రాతి ప్రతిమతో తన శరీరనిర్మాణం పోల్చుకున్నప్పుడు కాదూ... అది పురుష శరీర నిర్మాణానికి భిన్నంగా ఉన్నదన్న స్పృహ కలిగినప్పుడు కాదూ?

పురుష వేషధారణలో కొన్ని సంవత్సరాలుగా కఠినమైన ఆమె హృదయం కరగడం ప్రారంభించింది.

తను ఒక స్త్రీనన్న స్పృహ కలిగిన తరువాత మహాసామ్రాజ్య మహామంత్రి శివదేవయ్యతో జరిపిన సంభాషణ జ్ఞప్తికి వచ్చిందామెకి. అతడా రాజ్యానికి మహామంత్రి మాత్రమే కాదు--ఆమె పట్ల అతనికి పుత్రికా భావం. అంతకు మించి రాజ్య పరిరక్షణ అతని ప్రధాన కర్తవ్యం. వెరసి ఆయన ఆమెకు చాలా విషయాల్లో గురువు. సలహాదారు. మార్గదర్శకుడు. పితృతుల్యుడు. వీరశైవాలంబకుడైన ఆయనను అపర పరమేశ్వరుడిగా రుద్రమదేవి తండ్రి కాలం నుంచీ ఆదరించి గౌరవించారు.

రుద్రమ ఆయనను 'పెద్దనాయనగారూ' అని పిలిచేది.

000

"పెద్దనాయనగారూ.. ధర్మాలింత కఠినంగా ఎందుకుంటాయి?"

"కఠినంగా లేనిది ధర్మమెందుకవుతుందమ్మా? అది ఎంత కఠినంగా ఉన్నప్పటికీ, భరించి ఆదరించి ఆచరించగలిగినవారు కదా ధర్మనిరతులుగా, రుజువర్తనులుగా చరిత్రకెక్కేది" శివదేవయ్య సమాధానం ఇచ్చాడు.

"అంటే ధర్మం కొందరికే పరిమితమా... అది అందరూ ఆచరించవలసినది కాదా? అందరికీ దానితో నిమిత్తం లేదా?"

"లేకనేం? ఉంది... కానీ, పరీక్షకు నిలువగలిగిన వారెప్పుడూ కొద్దిమందే

ఉంటారు. దేశ్య కాలాలను బట్టి ధర్మాలూ మారుతూ ఉంటాయి. ఇంతకీ, ఏ ధర్మం గురించి తల్లీ నీ సందేహం?"

"శరీరధర్మం గురించి" ఆమె ప్రస్తావించబోయేది ఆయనకు అర్థమైంది. అందుకే, అర్ధనిమిలిత నేత్రుడై మౌనం వహించాడు ఆమెని కొనసాగించమన్నట్లుగా.

"స్త్రీ పురుష శరీర నిర్మాణాలలో వైరుధ్యాలు ఉన్నప్పటికీ, ఆ భిన్నత్వం ఎందుకు ఉద్దేశించబడిందో ఆ ప్రయోజనం పరిపూర్ణమయ్యేది యౌవనం అంకురించాకనే కదా పెదనాయనగారూ"

తలపంకించాడు మహామంత్రి. క్షణమాగి అన్నాడు.

"ధర్మాలను రెండు దృక్కోణాలలో చూడాలి తల్లీ... ఒకటి సామాజికం. మరియొకటి వైయుక్తికం. ప్రతి ధర్మానికీ ఒక విశిష్ట ప్రయోజనం నిర్దేశించబడి ఉంటుంది. మానవ జీవితం కేవలం ఒకటి రెండు ధర్మాలకే పరిమితమై ఉండదు. అలా కొందరికి ఉండి ఉండవచ్చు. వాళ్లు సాధారణ మాత్రులు. మరి కొందరికి పలు ధర్మాలను ఆచరించవలసిన ఆవశ్యకత, ఆచరించక గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు ఏది ఆచరించవలసిన ధర్మం? అనే సందేహం తలెత్తడం సహజం. అప్పుడు ఒక ధర్మాన్ని మరియొక ధర్మం నియంత్రించడం కూడా అంతే సహజం. అటువంటి పరిస్థితుల్లోనే వైయుక్తిక ధర్మాన్ని పక్కన పెట్టి సామాజికంగా ఏది పదిమందికి మేలు ఒనగూర్చగలదో దాన్ని ఆచరించడం పరమధర్మం..." సంభాషణ మర్మగర్భంగా జరుపుతున్నప్పటికీ, ఏ దిశగా మాట్లాడుకుంటున్నారో ఇద్దరికీ అవగతమవుతూనే ఉంది.

ఆమెకొక విషయం అర్థమైంది.

సమాజం ఏర్పడిననాటినుంచీ నాగరికత మొదలైన నాటినుంచీ ఏదో ఒక ధర్మం, ఏదో ఒక సామాజిక కట్టుబాటు, ఏదో ఒక నియంత్రణ స్త్రీ హృదయాన్ని ఆదేశిస్తూనే ఉంది. స్త్రీ గమనాన్ని నిర్దేశిస్తూనే ఉంది. స్త్రీత్వాన్ని అధిక్షేపిస్తూనే ఉంది. తనకు ప్రమేయం లేని ధర్మాల కోసం కూడా స్త్రీ నలిగిపోవలసి వస్తూనే ఉంది.

ఇరువురు రాజులు కలహించుకుంటే అందులో ఒకరు ఓడి, మరొకరు గెలిచినప్పుడు విజితుడైనరాజు తన కుమార్తెను విజేతైన రాజుకి ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా కూడా కట్టబెట్టడం ఏ ధర్మం?

రాజ్య విస్తరణ పేరిట యుద్ధాలు జరిపి అదే సమయంలో అంతఃపుర విస్తరణ కూడా జరుపుతూ ఉంటే ఆ యువతులందరినీ సవతులుగా భరించవలసి రావడం ఏ అంతఃపుర స్త్రీ ధర్మం?

వీటన్నింటికీ కారణం పాదుకున్న పితృస్వామ్య వ్యవస్థ. ఏళ్ళూనుకున్న పురుషాహంకారం... స్త్రీకి స్త్రీగా అస్తిత్వం లేదా...? ఆలోచనలు అంతరంగాన్ని మథిస్తున్నాయి.

"స్త్రీకి అధికారం నిషిద్ధమా పెదనాయనగారూ?" కొద్దిసేపు విరామం తరువాత ప్రశ్నించింది రుద్రమదేవి.

"నిషిద్ధమని కాదు... కానీ, సమస్యలు సిద్ధమవుతాయి. అందుకే, మీ నాయనగారికి ఇక పురుష సంతానం కలగదన్న విషయం తెలియగానే ఆయనా, నేను కలసి ఆలోచించి లోకానికి నిన్ను రుద్రమదేవ మహారాజుగానే పరిచయం చేశాం. నువ్వు కూడా సార్వభౌమత్వాన్ని ఎలా అంది పుచ్చుకున్నావో, వీరత్వంలోకానీ, ధీరత్వంలో కాని, పౌరుషంలో కానీ పురుషత్వాన్నే పలికించావు... అందుకే, అక్కడక్కడ శత్రు దురహంకారం మొలకెత్తినా దానికి ప్రతిసంహారం జరిగేది. ఒక స్త్రీగా నిన్ను ప్రపంచం భావించి ఉంటే జటిలమైన సమస్యలు మరింత జటిలం కావా తల్లీ... ఇంత సులభంగా పరిష్కారమయ్యేవా అమ్మా"

అనుభవంతోనూ, వయసుతోనూ నిండుగా పండిన ఆ వృద్ధుడి మాటల్లో కాకతీయ రాజ్యక్షేమం తప్ప మరే ఆలోచనా లేదని తెలుసు రుద్రమకి.

రాజ్యం పట్ల ఆయనకి ఉన్న అంకితభావం గురించి గర్వించిందామె. అటువంటి నిస్వార్థుడిని కాకతీయ రాజ్యం మహామంత్రిగా పొందగలిగినందుకు తమ ఇలవేల్పు ఏకవీర మహాదేవికి మనసారా నివాళులర్పించింది.

కాని, ఆమె మనసులో ఇంకా ఒక సందేహం మిగిలిపోయింది.

"ఒక పురుషుడు ఈ రాజ్యభారం వహించి ఉంటే మీరు చెప్పిన సమస్యలు అసలు తలెత్తకుండా సమసిపోయేవా పెదనాయనగారూ? రాజ్యకాంక్షకీ, స్వార్థానికీ లింగ వయోబేధాలు లేవు కదా! రాజ్యకాంక్ష పాము వంటిది కాదూ? తన పిల్లలనే చంపుకుని తిని తన ఆకలి తీర్చుకుంటుంది" ఏదో ఆలోచిస్తూ అంది రుద్రమ. అప్పటికే, పరధ్యానంలో వద్ద శివదేవయ్య మహామంత్రి "ఇక నేను వెళ్లొస్తాను తల్లీ" అంటూ నిష్క్రమించాడు.

000

ఆ సంభాషణ అంతా మనో యవనిక మీద దృశ్యమాలికలా గోచరించింది రుద్రమకి ఇప్పుడు. ఆ చివరి ప్రశ్నే మరొకసారి కదలాడింది.

'రాజ్యకాంక్షకీ, స్వార్థానికీ లింగవయో బేధాలు లేవుకదా' అనుకుంది. అంతలోనే ఆమెకు నవ్వు వచ్చింది.

'తను పురుషవేషంలో జీవిస్తోంది. పాలిస్తోంది. పురుషాధిక్యతను ప్రశ్నిస్తోంది. తిరిగి పురుష సంగమంలో ఉండే సంతృప్తిని వాంఛిస్తోంది... ఏమిటీ వైరుధ్యాలు తనలో? ఇన్ని అంతరాలు ఏనాడూ తనలో తను చూడలేదే?'

ఆమెకా క్షణాన కారు అంబరవీధిన మించునిమించు కాంతినిచ్చు ఒక తటిల్లతలా స్ఫురించిన పేరు చాళుక్య వీరభద్రుడు.


000

ఆ రోజుల్లో వీరశైవం విప్లవించినట్లు అతడిది పేరుకి తగ్గ మొగతనం.

నిడదప్రోలు అతడి సంస్థానం. అవడానికి అతడు సామంతుడే... కాని, ఆపద్ధర్మ వేళల్లో అతడు కాకతీయ సామ్రాజ్య రక్షకుడు. అందుకతడికి మహామంత్రి శివదేవయ్య ఆజ్ఞలు, ఆశీస్సులు పంత పాడతాయి.

రుద్రమదేవికి అతడు అత్యంత సామీప్యుడైన సామంతుడు. అతడామెని 'మహారాజా' అని సంబోధిస్తాడు. ఆమె 'మిత్రమా' అని పిలుస్తుంది.

దాయాదుల కూటమిలో ఒక శత్రురాజుని తిరిగి సైనిక బలం కూడగట్టుకోలేనంత తీవ్రంగా అణచివేసిన తరువాత ఒకరోజు ఇరువురూ కలసి 'మృగయా వినోదం' కోసం వన్యప్రాంతాలకు



వెళ్లారు. సైనిక బలం ఎక్కడో తప్పిపోయినది. ఇరువురూ ఏకాంతులైనారు.

వీరి బాణాలకు గురియైన మృగరాజు కూడా ప్రాణాలను చిక్కించుకొనింది.

ఆ సమయంలో శాఖోపశాఖలుగా విస్తరించిన ఒక వటవృక్షం కింద ఇరువురూ విశ్రాంతి తీసుకుంటూ ఏదో ముచ్చట్లాడుకుంటున్నప్పుడు చాళుక్య వీరభద్రుడు సంభాషణవశాత్తు ఇలా ప్రశ్నించాడు.

"మహారాజా... సార్వభౌమ కిరీటధారణ కంటకప్రాయామా?" అని.

"మిత్రమా... అట్లేల భావించితివి?" రుద్రదేవ మహారాజు వేషధారణలో ఉన్న రుద్రమ ప్రశ్నించింది.

"వేరే కారణం లేదు... ఊరకనే" వక్కాదోవ పట్టించడానికి ప్రయత్నించాడు వీరభద్రుడు.

కానీ రుద్రమకు తెలుసు--తను రుద్రదేవుడిగా సార్వభౌమాధికారం స్వీకరించిన నాటినుంచి ఈనాటివరకూ సామంతుల్లో తనకత్యంత ఆత్మీయుడు; శత్రువుల నుంచి ఎటువంటి భయోత్పాత పరిస్థితులు ఏర్పడినా అనుక్షణం అప్రమత్తత వహించగలవాడు వీరభద్రుడే అన్న సంగతి.

అంతేకాదు రుద్రమకి తెలిసినది మరియొకటి కూడా కలదు. తను పురుషుడిగా చలామణీ అవుతున్న ఒక స్త్రీ అని అప్పటికే పలుచోట్ల అభిశంసనలు ప్రభావిస్తున్నాయని... ఈ విషయం వీరభద్రుడికి కూడా తెలుసేమోనన్న సంశయం ఆమె మదిలో మొదలవడానికి క్షణకాలం కూడా పట్టలేదు. అందుకే అంది--

"కాదుకాదు మిత్రమా... మీరు ఊరకనే ఏమి అనరు" అని క్షణకాలమాగింది. తరువాత తిరిగి ప్రశ్నించింది.

"మీ దృష్టిలో కిరీటం కంటక ధారణమే కావచ్చును... కాని, ఆ కంటకాలకి స్త్రీ, పురుష బేధముందా?" వీరభద్రుడు ఒక్కక్షణం కూడా ఆలోచించలేదు. బదులిచ్చాడు "శాస్త్రాల దృష్ట్యా, ధర్మాల దృష్ట్యా, క్రియా దృష్ట్యా... ఎలా చూసినా స్త్రీ అబల కదా! ప్రయోజనశీల ప్రగతిగతిలో పయనించే ఈ ప్రపంచపు ఉధృతిని అబలయైన స్త్రీ తట్టుకొనగలదా?"

"తట్టుకొనలేకపోతే ఈ తరానికి మరియొక తరమెక్కడుంటుంది? నిజానికి ఈ ఉధృతిని తట్టుకోలేనిది 'మీ' పురుషులే... శౌర్యచలనానికీ, భుజశక్తికి వేషధారణ అగడ్త కావచ్చునేమో కానీ, అది ఏమాత్రం పొగడ్త కాదు" అప్పటికే రుద్రమదేవి నయనద్వయం ఆరుద్రవర్ణ సంశోభితమైంది.

వీరభద్రుడి కళ్లు మాత్రం వాంఛిత విషయ లభ్యాద్వష్టాలై ప్రకాశించుతున్నాయి.

"మరి ఈ ప్రాణిని గ్రహించవచ్చును కదా రుద్రమదేవీ?" ఆఖరి అంకానికి తెర దించుతున్నట్లుగా అడిగాడు వీరభద్రుడు.

"మిత్రమా... ఏమంటున్నారు మీరు.. మన వేటకు పడలేదని మృగరాజు మృగరాణి కాబోదు... నేను రుద్రదేవి మహారాజుని... మీరు సామంతులు... నమ్మకూడని వదంతులు నమ్ముతున్నట్లున్నారు" చివ్వున ధనువుని విడిచిన శరమై, జటజాటము వదిలిన జలమై ఉవ్వెత్తున కదిలింది రుద్రమ.

000

'ఎందుకీ సోయగం... ఎందుకీ యవ్వన యుగం... ఎవరికీ సగమై పంచనిదెందుకని? ఆకర్షణీయమూ, కాంతివంతమూ అయిన ఈ వదనాన్ని అపరిమిత దీక్షతో ఆ బ్రహ్మ తీర్చిదిద్దినదెందుకని?

కమలాలను నయనాలుగా మార్చినదెందుకు?

నాసికను సంపెంగకు పోలిక పెట్టినదెందుకు?

భ్రమరాలు విరులని భ్రమసి ఈ అధరాల చుట్టూ భ్రమణం చేసేదెందుకు?

వెనుదిరిగి జడనొక్కసారి ముడివిప్పి విదిలిస్తే బారెడు నాగుపాము బుసలెందుకు?

కంచుకం అంచు ప్రతిరేయీ బిరుసెక్కేదెందుకు?

లో పావడా బిగువు ప్రతి తెల్లవారుఝామునా సడలేదెందుకు?'

అవాళ...ఆ పున్నమిరేయి...జాములు దాటినాయి.

అయినా, రుద్రమదేవి హృదయం అగ్నిశిఖలు తాకిన హిమాద్రిలా కరిగి బిందువులై ప్రవహిస్తోంది. భగీరథుడి వెనుక నడిచిన గంగలా ఉరవళ్లు పరవళ్లుగా నురగలు కక్కుతూనే ఉంది.

'వెళ్లిపోనా... ఈ రాజ్యాధికారం నిర్బంధమూ, ఈ రాజ్య పర్యవేక్షణా కాంక్ష, ఈ రాజ్య సార్వభౌమత్వ వివశత్వమూ విడిచిపెట్టి' అనిపించిందామె హృదయానికి.

'వెళ్లిపోయి ఒక్కసారిగా తన ఆత్మీయుడు వీరభద్రుడి గాఢమైన కౌగిలింతలో ఇంతకు మించిన సౌఖ్యం పొందలేనా?

ఆ సౌఖ్యం ముందు ఈ రాజ్యమెంత?

ఆ సంతృప్తి ముందు ఈ అధికారమెంత?'

కాని, రుద్రమ కదలలేదు మెదలలేదు.

పురుష సంతానానికే వారసత్వం... లేనిచో స్త్రీకి ఆ పురుష వేషధారణ...

అలా మభ్యపెట్టనినాడు దాయాదులు విజృంభిస్తారు. శత్రువులు శౌర్యం చూపుతారు. ప్రజలు విప్లవిస్తారు.

వాటన్నింటినీ అణచివేయగలగాలి. అందుకు స్త్రీ మొదట తనను తాను అణచివేసుకోగలగాలి. అందుకు మూల్యం దేశ్యకాల ధర్మాలకు అతీతంగా ఒక ఆడదాని కన్నీరు. అందుకే ఆ రేయి ఆమె దుఃఖించింది. ఆ రాత్రి రుద్రమదేవి వివశ...దుఃఖిత...విధివంచిత...అధికార సర్పదష్ట. కురిసిన ఆమెకన్నీరు కరడుగట్టి గండుశిలగా మారి కఠినత్వాన్ని సంతరించుకుంది.

వేయి స్తంబాల గుడి నగరిలో నిశ్చలమై, నిరామయమైన రుద్రమదేవి కన్నీటి కాఠిన్యమే వేయి న్నొక్కటో స్తంభమై నిలిచిందా రేయి. కమనీయతకు రమణీయతకు ప్రతీకలుగా నిలిచిన ఆ వేయి స్తంభాలకుమల్లే ఈ వెయ్యి న్నొక్కటో స్తంభంకూడా వేయి పున్నములు వెదజల్లేదెప్పుడో ఆ కాల పురుషుడికే తెలుసు.

000

చాళుక్య వీరభద్రుడితో రుద్రమదేవి మనువుకీ, శత్రు సంహారానికీ తగిన వ్యూహరచన సాగిస్తున్న శివదేవయ్య మహామంత్రికీ తెలుసు. ■

